


ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

- బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వలలో యువత
- అవసరాల కోసం రుణ యాప్‌లపై పేదల మొగ్గు
- అవసరాల కోసం ఉచ్చులో పడుతున్న జనం
- బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- మెసేజ్, లింక్‌లకు స్పందించొద్దని సూచన
- మోసపోతే 1930ను సంప్రదించాలని సలహా

7

జీవితాలతో 'సెల్'గాటం!





ప్రస్తుతం సెల్‌ఫోన్ మానవుడి దైనందిన జీవితంలో ఒక భాగమైంది. సెల్‌ఫోన్ లేనిదే గడవలేని పరిస్థితి నెలకొంది. చేసే పనిలో కొంత విరామం దొరికినా.. లేదా కాలక్షేపం కోసమైనా సెల్ ఫోన్ చూసుకునే రోజులున్నాయి. ఈ క్రమంలో కొందరు ఆన్‌లైన్‌లోకి తొంగిచూస్తున్నారు. బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, లింకులు, ఇన్వెస్ట్‌మెంట్, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపైకి దృష్టి మరల్చి జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొంతమంది యువత తల్లితండ్రులకు తెలియకుండానే వారి ఖాతాల్లోని డబ్బులను బెట్టింగ్, గేమింగ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగం వస్తుందేమోననే ఆశతో మోసపూరితమైన ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. అందులో విడతల వారీగా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని తెలుసుకొని జరిగిన నష్టాన్ని పూడ్చలేక విగత జీవులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో లింక్‌లు, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. డబ్బు పోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు పైగా మోసపోతే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో, ఆలోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలోనే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. - వరంగల్ క్రైం

మూగబోయిన జానపద ఝరి

బలగం మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. భార్యకు ఆర్థిక సాయం
- దుగ్గొండిలో ముగిసిన అంత్యక్రియలు

ఆయన గొంతెత్తితే గాన మాధుర్యమే.. జానపదాలు చెబితే గంటల తరబడి రెప్పవాల్చకుండా చూడాల్సిందే.. పద్యం అందుకుంటే గుండెలు గిల్లుమనాల్సిందే.. ఆయనే.. బుడిగ జంగాల సామాజిక వర్గానికి చెందిన పస్తం మొగిలయ్య. సంచలన విజయం సాధించిన బలగం సినిమాలో పతాక సన్నివేశంలో మానవ సంబంధాల ఔనత్యాన్ని వివరిస్తూ చేసిన ఆయన గానం ప్రేక్షకుల కంట తడిపెట్టించింది. బలగం సినిమాకు ఆ సన్నివేశమే హైలైట్‌గా నిలిచింది. దీంతో మొగిలయ్య పేరు తెలుగువారందరికీ సుపరిచితమైంది. అంతలా ప్రేక్షకులతో కన్నీరు పెట్టించిన మొగిలయ్య అనారోగ్యంతో గురువారం కన్ను మూశారు. స్వస్థలం దుగ్గొండిలో అంత్యక్రియలు ముగిశాయి.

- దుగ్గొండి

7





సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సాట్ చైర్మన్ శివసేనారెడ్డి

నిష్ణాతులైన కోచ్‌లు తయారు కావాలి..

- ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచేలా క్రీడాకారులకు తర్ఫీదునివ్వాలి
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడలు
- వర్చువల్‌గా పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్స్‌లో క్రీడల్లో పతకాలను తీసుకవచ్చే క్రీడాకారులను తయారుచేసే ప్రతిభ కలిగిన కోచ్‌లు రాష్ట్రం నుంచి అందుబాటులోకి రావాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) చైర్మన్ శివసేనారెడ్డి కోరారు. గురువారం హనుమకొండ జేఎన్‌ఎస్ క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమానికి శివసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారదతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం శివసేనారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి నిష్ణాతులైన కోచ్‌లను తయారు చేసి వారి ద్వారా క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి ఒలంపిక్స్‌లో పతకాలను సాధించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి క్రీడల్లో రాణించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. సీఎం కప్ క్రీడాపోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 10మంది క్రీడాకారులను ప్రత్యేక క్యాంపునకు ఎంపిక చేసి శిక్షణ అందించి ఏషియన్ గేమ్స్‌కు పంపిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించడంవల్ల చెడు అలవాట్లకు దూరమవడమే కాకుండా క్రమ శిక్షణ పెంపొందుతుందన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన జివాంజీ దీప్తి పారా ఒలంపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించి ఉన్నత శిఖరాలను చేరుకుందని గుర్తు చేశారు. ప్రతీ మండల, జిల్లా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో క్రీడా మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందించే విధంగా ప్రయత్నాలు చేపడుతామన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ములుగులో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని శివసేనా రెడ్డి పేర్కొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడానికి సీఎం కప్ వేదికగా మారిందన్నారు. ముంబయికి చెందిన క్రీడా నిపుణుల బృందం జేఎన్‌ఎస్‌ను సందర్శించి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ ఆధారంగా వారికి సలహాలు, సూచనలు, మెళకువలు నేర్పిస్తుందన్నారు. డీవైఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని జిమ్నాస్టిక్స్‌హాల్‌లో రాష్ట్రస్థాయి బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రూ, డీఎస్‌ఏ కోచ్‌లు, పీటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్‌గా పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హనుమకొండ జేఎన్‌ఎస్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే వర్చువల్‌గా పాల్గొన్నారు. మైదానం లో ఏర్పాటు చేసని స్క్రీన్‌లో వర్చువల్‌గా వీడియో ద్వారా మాట్లాడారు. రెవెన్యూ, హౌజింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. క్రీడల వల్ల నాయకత్వపు లక్షణాలు పెంపొందుతాయన్నారు. పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఓరుగల్లులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న జిమ్నాస్టిక్స్ పోటీల్లో 200మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారన్నారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం..

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ
- ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతుల స్వీకరణ

6



ఆజంజాహీ స్థలం కార్మికులకే చెందేలా చూస్తా..

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు
- యూనియన్ కార్యాలయ స్థలంలో పనుల నిలిపివేత

6



కార్మిక భవనం వెంటనే నిర్మించాలి

- కబ్జాదారులకు అండగా అధికార పార్టీ నేతలు
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



కార్మిక భవనానికి శంకుస్థాపన చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
- అనుమతుల రద్దు కోసం కమిషనర్‌కు నేతల వినతి

రైల్వే స్టేషన్‌లో పనులు వేగవంతం చేయాలి

- సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్
- వరంగల్‌లో రైల్వే అధికారుల క్వార్టర్లు ప్రారంభం



వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం

గిర్మాజిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమృత్‌భారత్ అభివృద్ధిలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన విజయవాడ - కాజీపేట రైల్వే మార్గంలోని వివిధ అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను డీఆర్ఎం తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక రైలులో వరంగల్‌కు చేరుకున్న డీఆర్ఎం.. వరంగల్ రైల్వేస్టేషన్‌లో రూ.4కోట్లతో నిర్మించిన తొమ్మిది రైల్వే అధికారుల క్వార్టర్లను రాత్రి ప్రారంభించారు. ఆర్పీఎఫ్ బ్యారక్ వెనుక నిర్మించిన టైప్ 2 క్వార్టర్లు 4, టైప్ 3 క్వార్టర్లు నాలుగింటిని ప్రారంభించారు. అక్కడే కొన్ని మొక్కలు నాటారు. అలాగే పీడబ్ల్యూఐ అధికారి టైప్ 4 క్వార్టర్‌ను ప్రారంభించారు. నాలుగో ప్లాట్‌ఫామ్ నుంచి నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటి ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన జనరల్ ప్రయాణికుల విశ్రాంతి మందిరాన్ని పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న కోచ్ రెస్టారెంట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి సత్వరం ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా పనులు వేగవంతం చేయాలని చెప్పారు.

అనంతరం డీఆర్ఎం జైన్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను మే నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసుస్టేషన్లను ప్లాట్‌ఫామ్ లెవెల్‌కు పెంచి నూతనంగా నిర్మించనున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులు అలస్యం కాకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్ఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఈఎన్ (సౌత్) దినకర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వై.బాలాజీ కిరణ్, వరంగల్ సీసీఐ రాజ్‌గోపాల్, ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్సైలు వెంకటేశ్వర్లు, మోహినుద్దీన్, వివిధ విభాగాల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

హసన్‌పర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు హాస్టల్స్ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రైవేటు హాస్టల్స్ యజమానులకు సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా హనుమకొండ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక భీమారం శుభం కల్యాణ వేదికలో హనుమకొండలోని ప్రైవేటు హాస్టల్స్ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా హాస్టల్‌కు వచ్చిపోయే వారి వివరాలను ఎప్పటికప్పుడు నోట్ చేసుకోవాలని, అంతేకాకుండా హాస్టల్స్‌లో ఉండే వారి దినచర్యపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వారిని బయటికి వెళ్లేందుకు అనుమతించవద్దని, వీరి కోసం వచ్చే వారి గురించి తగిన సమాచారం తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో సమస్యలు ఉంటే ఈ నెల 31 వరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి నుంచి హాస్టల్స్ ముమ్మరంగా తనిఖీలు చేస్తామన్నారు. పోలీసుల సూచనలు పాటించని హాస్టల్స్‌పై చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ భట్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సుంకరి రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- వరంగల్‌లో ప్రజాసంఘాల మండిపాటు
- బల్దియా ఆవరణలో నిరసన

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రస్తావిస్తూ పార్లమెంట్ సాక్షిగా అనుచిత వాఖ్యలు చేసిన దేశ హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వామపక్ష కార్మిక ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా దేశంగా రాజ్యాంగబద్ధంగా కొనసాగే పార్లమెంట్‌లో రాజ్యాంగ రచనకు ప్రాణం పోసిన అంబేడ్కర్‌కు గౌరవం ఇవ్వని అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాఫ్రంట్ (డీపీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టాలని బీజేపీ ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...



బల్దియా ఆవరణలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల కమిటీపై పునరాలోచించాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్

ఖిలావరంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఎంపికలో పార్టీ సీనియర్లను విస్మరించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆరోపించారు. గురువారం 34వ డివిజన్ శివనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 30ఏళ్లుగా కాంగ్రెస్‌నే నమ్ముకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో తనపై బెదిరింపులు, పోలీస్ కేసులతో పాటు జైలు పాలయ్యానన్నారు. మంత్రి కొండా సురేఖ గెలుపు కోసం తాను ఎంతగానో కృషి చేశానన్నారు. అయితే బీఆర్ఎస్ కాలంలో తనపై దాడి చేసిన వారికే ఇందిరమ్మ కమిటీలో చోటు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ - మురళీధర్‌రావులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ విషయంలో పునరాలోచించాలని కోరారు. అలాగే ఇటీవల పార్టీలు మారిన వారికే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేర్లు రావడం తగదన్నారు. తనను నమ్ముకున్న వారికి కమిటీలో తగిన ప్రాధాన్యం ఇవ్వకుంటే హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రాలిచ్చి గాంధీ భవన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజమ్మ, సంతోషిణి, కె.ఉమాదేవి, మాధవి, అజీరా, రమ, స్వరూప, బి.వెంకన్న, రమేష్, పాము వెంకన్న, ప్రదీప్, మస్తాన్ పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్

ఆ స్థలం మిల్లు కార్మికులకే చెందేలా చూస్తా..

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు
- యూనియన్ కార్యాలయ స్థలంలో పనుల నిలిపివేత


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండా మురళీధర్‌రావు

వరంగల్‌సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యూని యన్ కార్యాలయం స్థలంలో వస్త్ర వ్యాపారి చేయిస్తున్న పనులను వెంటనే నిలిపివేయించి ఆ భూమి ని మిల్లు కార్మికులకే చెందేలా చూస్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు స్పష్టం చేశారు. గురువారం ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు వస్త్ర వ్యాపారి కాసం ఓంనమశ్శివాయ ఫోన్ చేసి పూజా కార్యక్రమానికి ఆహ్వానించారన్నారు. ముందు అంతా టెంట్లు వేయడంతో స్థలాన్ని సరిగ్గా గుర్తించలేకపోయానన్నారు. మరుసటి రోజు కార్మికుల భూమి అని కార్మికవర్గాలు ఆందోళన చేస్తుంటే.. ఏం జరిగిందని ఆరా తీశానన్నారు. దీంతో వారు కాగితాలను చూపించారని చెప్పారు. ఆ కాగితాల్లో ఎక్కడ కార్మికులదిగా కనిపించలేదని, అయినా తాను కార్మికుల పక్షాన ఉండే వాడిని కాబట్టి వాళ్లకు న్యాయం చేయడం తన బాధ్యత అని అన్నారు. ఈ మేరకు సర్వే చేయాలని తహసీల్దార్ ఎక్బాల్‌కు తెలిపామన్నారు. సర్వేలో ఎలా వచ్చినా.. అవసరమైతే తాను కొనుగోలు చేసైనా ఆ భూమిని కార్మికులకు చెందేలా చూస్తానని కొండా మురళి హామీ ఇచ్చారు. ఆ భూమిలో ఎలాంటి పనులు జరుగకుండా నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ ఎక్బాల్‌కు చెప్పారు. దీంతో తహసీల్దార్ మిల్లు కార్మికుల యూనియన్ కార్యాలయ స్థలంలో ఎలాంటి పనులు జరుగకుండా నిలిపివేయించారు.

'అజాంజాహి' వివాదంలో కీలక మలుపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


యూనియన్ కార్యాలయ స్థలంలో వస్త్ర వ్యాపారి చేయిస్తున్న పనులను నిలిపివేయించిన తహసీల్దార్

వరంగల్‌సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజులుగా తీవ్ర చర్చనీయాంశమైన వరంగల్‌లోని అజంజాహి మిల్లు కార్మిక భవనం వివాదంలో కీలక మలుపు తిరిగింది. 75 ఏళ్ల నుంచి మిల్లు కార్మికులు నిర్మించుకున్న యూనియన్ కార్యాలయ భవనం, స్థలంలో ఓ వస్త్ర వ్యాపారి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పూనుకున్నారు. ఆ భూమి పూజా కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పాల్గొనడం రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతి కార్మికుల పక్షాన నిలిచి.. 'నాడు తప్పు.. నేడు ఒప్పు.' 'ఓరుగల్లులో అజంజాహీ రగడ' కార్మికుల స్థలంలో భూమి పూజ, ఆ భూమి కార్మికులదే అంటూ.. వరుస కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిఘా విభాగంతో మిల్లు భూమికి సంబంధించిన నివేదికను తెప్పించుకున్నారని.. ఆ తర్వాత సీఎం ఆదేశాల మేరకు కొండా మురళీధర్‌రావు యూ టర్న్ తీసుకున్నారని తెలుస్తోంది. అందులో భాగంగానే గురువారం ఓసిటీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి కార్మికులకే ఆ స్థలం దక్కేలా చూస్తానని, ఆ స్థలంలో వస్త్ర వ్యాపారి చేయి స్తున్న పనులను వెంటనే నిలిపివేయించి ఆ భూమిని మిల్లు కార్మికులకే చెందేలా చూ స్తానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు స్పష్టం చేశారు. తాను హైదరాబాద్‌లో ఉన్నప్పు డు ఫోన్ చేసి పూజా కార్యక్రమం ఉంది రమ్మంటే వెళ్లానే తప్ప వ్యాపారికి ఏదో లాభం చేకూర్చాలని కా దని చెప్పారు. ఏదేమైనా తాను కార్మికుల పక్షాన ఉండే వ్యక్తినని, వారికి న్యాయం చేయడం తన బాధ్యతన్నారు. వెంటనే సర్వే చేయాలని తహసీల్దార్‌కు చెప్పామని, సర్వేలో ఎలా వచ్చినా.. అవసరమైతే తాను కొ నుగోలు చేసైనా ఆ భూ మిని కార్మికులకు చెందేలా చూస్తానని స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ నాయ కులు కూడా 'ఆంధ్రజ్యోతి' అక్షర కృషి ప్రశంసించారు.

'ఆంధ్రజ్యోతి'కి కార్మికుల సలాం

మిల్లు కార్మికుల యూనియన్ స్థలంలో ఓ వస్త్ర వ్యాపారి అక్రమంగా భవన నిర్మాణ పనులు చేపడుతున్న క్రమంలో తమ పక్షాన 'ఆంధ్రజ్యోతి' అక్షరపోరాటం చేసిందంటూ కార్మికులు అభినందనలు తెలిపారు.

కార్మిక భవనానికి శంకుస్థాపన చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు


బల్దియా కమిషనర్ అశ్వినికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ శ్రేణులు

మిల్స్‌కాలనీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అజాంజాహి మిల్లు కార్మికుల స్థలంలో కార్మిక భవనానికి శంకుస్థాపన చేయిస్తేనే మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాటలు విశ్వసిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు స్పష్టం చేశారు. గురువారం ఓసిటీలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు న్యాయం చేస్తానని మురళి చెప్పడం సంతోషమే అయినా రెండు మూడు రోజుల్లో అదే స్థలంలో కార్మిక భవనం నిర్మాణానికి నిధులు తెప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల స్థలంలో భూమి పూజ చేసిన వ్యాపారి తప్పుడు పత్రాలను రద్దు చేయాలన్నారు. ఆ భూమిపూజలో కొండా మురళి పాల్గొనడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైనా మంత్రి సురేఖ కార్మిక భవనానికి నిధులు సమకూర్చి స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అనంతరం బీజేపీ నాయకులు మాజీ మేయర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాజేస్తున్న వారికి వంతపాడటం సబబు కాదన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని రక్షించేందుకు కార్పొరేషన్, కుడా, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులకు అనుమతులిస్తున్న కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు తీరును తప్పుబట్టారు. కార్మికులు, ప్రజలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, నాయకులు రామగళ్ల పరమేశ్వర్, వంగాల సమ్మిరెడ్డి, బైరి మురళీకృష్ణ, కాసు శిల్ప, సిద్ధం నరేష్, రఘునారెడ్డి, రంజిత్‌కుమార్, మహేష్, మార్టిన్ లూథర్, నాగరాజు, అజయ్, రాజు, సురేష్, శ్రీనాథ్, క్రాంతి, హరీష్, శ్రీనివాస్, నాగార్జునపాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

షాపింగ్ మాల్ అనుమతులు రద్దు చేయాలి

అజంజాహి మిల్లు కార్మికుల స్థలంలో షాపింగ్‌మాల్ నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులు సత్వరమే రద్దు చేయాలని బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బీజేపీ శ్రేణులతో కలిసి గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక యూనియన్ భవన్ కూల్చివేసి షాపింగ్‌మాల్ నిర్మాణం చేయడాన్ని తప్పుబట్టారు.

అక్రమార్కులు, భూకబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రావుల కిషన్, కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, చాడ స్వాతి, జలగం అనిత, బైరి లక్ష్మి, రావుల కోమల, గుజ్జుల వసంత, ఆడెపు స్వప్న, గందె కల్పన తదితరులు పాల్గొన్నారు.

'అజాంజాహి'లో కార్మిక భవనం నిర్మించాలి

కార్మికులకు బీఆర్ఎస్ మద్దతు : మాజీ ఎమ్మెల్యే నరేందర్

కరీమాబాద్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): అజాంజాహి మిల్లు స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. అజాంజాహి స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని, కార్మికులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. కొంతమంది భూకబ్జాదారులకు అధికార పార్టీ నాయకులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. అజాంజాహి స్థలాన్ని కబ్జా చేసి అమ్మకానికి పెట్టారని, నగరంలోని ఓ వస్త్ర వ్యాపారి ఆ స్థలాలను కొనుగోలు చేయగా, అధికార పార్టీ నాయకులు భూమి పూజకు హాజరవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మళ్లీ.. తమకు ఏం తెలియదంటూ అమాయకంగా సమావేశాలు ఏర్పాటు చేసి కార్మిక పక్షపాతిగా చెప్పుకోవడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఈ స్థలాల విషయంలో గతంలో కబ్జాకు పాల్పడుతున్నానని తనపై బురద జల్లారన్నారు. నరేష్‌రెడ్డి అనే వ్యక్తి నగరంలో పలు చోట్ల కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. నరేష్‌రెడ్డి వద్ద గత సంవత్సరం నగరంలోని ఓ వస్త్రవ్యాపారి అజాంజాహి స్థలాలను కొనుగోలు చేశారన్నారు. రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు కబ్జాదారులతో కలిసి తతంగమంతా నడిపిస్తున్నారన్నారు. వెంటనే అజాంజాహి మిల్లు స్థలంలో కార్మిక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, దిడ్డి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్లు కొంతం మోహన్, కుందారపు రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.రమేష్ బాబు, గోరంట్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్


కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బల్దియా ఇచ్చిన అనుమతులు రద్దు చేయండి

కమిషనర్‌కు వరంగల్ ప్రజాసంఘాల వినతి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అజంజాహీ మిల్లు కార్మిక సంక్షేమ సంఘం భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించడానికి బల్దియా కార్యాలయం టౌన్‌ప్లానింగ్ నుంచి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని వరంగల్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో వరంగల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, జిల్లా నాయకుడు కుమార్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల, పౌరహక్కుల సంఘం నాయకుడు కాంపెల్లి ప్రవీణ్, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు సుమన్, సీపీఐ యూ (ఎంఎల్) నాయకుడు జగదీశ్వర్, గంగుల దయాకర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు తిరుమల శ్రీనివాస్, ఐతం నరేష్‌లు ఉన్నారు.

దేశప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

(5వ పేజీ తరువాయి)

చూస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ కపట నాటకాలు ప్రజలు చూస్తున్నారని అన్నారు. మనువాదులకు వ్యతిరేకంగా అంబేద్కర్‌వాదులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. బల్దియా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదపుటంచులో ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఏకమైతే తప్ప రిజర్వేషన్ ఫలాలు అందుకోలేమని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ప్రజాస్వామ్య ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్ఎస్ జిల్లా నాయకుడు కుమార్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల, మున్సిపల్ జేఏసీ నాయకులు ఏల్పుల ధర్మరాజ్ యాదవ్, పౌరహక్కుల సంఘం నాయకుడు కాంపెల్లి ప్రవీణ్, సీపీఐ ఎంఎల్ (న్యూ డెమోక్రసీ) నాయకులు సుమన్, సీపీఎం నాయకుడు సింగారం బాబు, సీపీఐ నాయకులు పనాస ప్రసాద్, జాక్ నాయకుడు బాచీ, టీఎమ్మార్పీఎస్ నాయకులు బొక్క ఏలియా, సీపీఐ యూ (ఎంఎల్) నాయకుడు జగదీశ్వర్, గంగుల దయాకర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు తిరుమల శ్రీనివాస్, ఐతం నరేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో 135 వినతులు స్వీకరణ


కమిషన్‌కు ఇచ్చిన వినతిపత్రాన్ని చూపిస్తున్న పంబాల కుల వృత్తి కళాకారుల సంఘం నాయకులు


హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం నిర్వహించిన బహిరంగ విచారణలో తమ దృష్టికి వచ్చిన అభ్యర్థనలు, విన్నపాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్ కులాల్లో వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతులు, అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కుల సంఘాల అభ్యర్థనలు, వినతులు సేకరించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందజేసి న్యాయం చేస్తామన్నారు.

స్వాగతం పలికిన ఇన్‌చార్జి కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్న ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదా దేవి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఘనంగా సన్మానించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల నుంచి ఎస్సీ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర, ఉమ్మడి జిల్లా కమిటీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయాలని వినతులు అందజేశారు. జాతీయ మాల మహానాడు నాయకులు ఎస్సీ వర్గీకరణ చేయొద్దని వినతిపత్రం అందజేశారు. అదే విధంగా అత్యంత వెనుకబడిన పంబాల కులాన్ని ఎస్సీ ఏ గ్రూపులో చేర్చి జనాభా ప్రాతిపదికన కాకుండావ వెనుకబాటు ప్రాతిపదికన ఎక్కువ రిజర్వేషన్ కల్పించాలని పంబాల కులవృత్తి కళాకారుల సంఘం నాయకులు కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, వరంగల్ ఉమ్మడి జిల్లా డీఎస్సీడీఓ, ఎస్‌డబ్ల్యూఓలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు, పలువురు జిల్లా అధికారులు, వివిధ ఎస్సీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె ఉధృతం

మద్దతు తెలిపిన వరంగల్ జిల్లా ఎంఈవోలు


ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న ఎంఈవోలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష(ఎస్ఎస్) కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె దీక్షలు ఉధృతంగా సాగుతున్నాయి. బాలసముద్రం ఏకశిలా పార్కు వద్ద చేస్తున్న దీక్షలు గురువారం 13వ రోజుకు చేరాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రతీ రోజు ఆయా జిల్లాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి వినూత్న రీతిలో నిరసన దీక్షలు చేస్తున్నారు. గురువారం వరంగల్ జిల్లా మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, హెచ్ఎంలు సైతం దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. దీక్షల నిర్వాహణకు ఎంఈవోలు రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెగ్యులైజ్ చేసే వరకు మినిమం టైం స్కేల్ ఇచ్చి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు.

ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలి

పీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల దీక్షలను సందర్శించి ఇచ్చిన హామీని, ఇపుడు సీఎం అయిన తరువాత ఎందుకు ఇవ్వటం లేదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ప్రశ్నించారు. గురువారం ఆయన దీక్షలను సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. కేంద్రం సమగ్రశిక్ష ద్వారా విద్యాశాఖకు అందిస్తున్న నిధులకు అనుగుణంగా రాష్ట్రం వాటా ఇస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రం వాటా ఇవ్వకుండా కేంద్రనిధులపై ఆధారపడటం వల్ల విద్యావ్యవస్థ కుంటుబడుతోందన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రోబయోలజీ సబ్జెక్టులో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు ఎంపికకు డిసెంబరు 20న శుక్రవారం ఉదయం 10.30గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55శాతం మార్కులున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. అయితే పీహెచ్‌డీ, నెట్, స్లెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నేరుగా ఒరిజినల్స్ ధ్రువపత్రాలతో కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఆర్‌వోఆర్-2024 చట్టంతో ప్రజలకు మేలు

ట్రెంగ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి

రాంనగర్, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఓఆర్-2024 చట్టంతో ప్రజలకు చాలా మేలు జరగనుందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి అన్నారు. భూ హక్కుల కల్పన ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతాయని, గ్రామ కంఠం, ఆబాది భూములకు చట్ట బద్ధత కల్పించి రుణాలు పొందేవిధంగా తీసుకొచ్చిన చట్టాన్ని గౌరవిస్తున్నామన్నారు. ప్రతీ గ్రామానికి ఒక రెవెన్యూ ఉద్యోగిని నియమించే పాత పద్ధతిని పునరుద్ధరించడం సంతోషదగ్గ విషయమన్నారు. రెవెన్యూశాఖ బలోపేతంతోపాటు ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా రెవెన్యూ సేవలను తీసుకోస్తున్నందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్, టీయూవీ రీఇన్‌లాండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డీఫార్మసీ, బీఫార్మసీ, బీటెక్, డిగ్రీల్లో ఉత్తీర్ణులైనవారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

అర్హత, ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఉదయం 10.30 గంటలకు ములుగురోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 7093168464 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6012	3000
పల్లికాయ (పచ్చిది)	5200	4500
కందులు	-	-
పెసళ్లు	5212	4000
పత్తి	7020	5800
పసుపు (కాడి)	10469	9823
పసుపు (గోల)	10336	9834
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16100	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	14000	13000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

ఆన్‌లైన్ మోసాలపై 1930ను సంప్రదించాలి

ఆన్‌లైన్ ద్వారా చేసే ప్రతీ పనిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మన పని మనం చేసుకుంటుండగానే మోసపూరితమైన లింక్‌లు, మెసేజ్‌లు వస్తుంటాయి వాటి జోలికి వెళ్లకూడదు. మోసం జరిగినట్లు గ్రహిస్తే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం అందించాలి. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ పని చేస్తోంది. ఫిర్యాదుల ద్వారా చాలామందిని కాపాడగలిగాం. ఏ ఒక్కరూ ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, లోన్ యాప్‌లు, ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామనే మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. ముఖ్యంగా పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దు.

- సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



జీవితాలతో సెల్‌గాటం!

ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక రంగంలో అనేక మార్పులు వస్తున్నాయి. దానిని సరిగ్గా వినియోగించుకునే వారు లక్షల్లో వేతనాలు పొంది విలాసవంతంగా జీవిస్తుంటే.. దానిని దుర్వినియోగం చేసుకునే వారి జీవితాలు రోడ్డున పడుతున్నాయి. తద్వారా వచ్చే మానసిక ఒత్తిళ్లను తట్టుకోలేక బలవన్మరణం పొందుతూ కుటుంబాలకు శోకం మిగుల్చుతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ వేదికగా ఒకటికి రెండింతలు డబ్బులు ఇస్తామని ప్రసారమయ్యే మోసపూరిత ప్రకటనలను ఆకర్షితులై చట్టబద్ధత కానీ యాప్‌లు, లింక్‌ల ద్వారా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని లబోదిబోమంటున్నారు. మరికొంతమంది లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు పొంది వాటిని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌లపై పెట్టుబడిగా పెట్టి ఆ తర్వాత డబ్బులు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఆ నష్టాన్ని పూడ్చలేక అడ్డదారులు తొక్కి చివరికి ఆ సమస్య నుంచి బయటపడలేక మానసిక ఒత్తిళ్లతో అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు.

ఆశ చూపి వలలోకి..

సైబర్ దొంగలు వివిధ మార్గాల్లో ప్రజలను తమ వలలోకి దింపి జేబులు లూటీ చేస్తున్నారు. ఉద్యోగం, ఇన్వెస్ట్‌మెంట్, కొరియర్ పేరిట ముందుగా ఆకర్షించి ఆ తర్వాత నట్టేట ముంచుతున్నారు. ఆన్‌లైన్‌లోని మోసాలకు ఎలాంటి తారతమ్యం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారాలు, గృహిణులు, చిన్నా, పెద్ద తేడా అందరూ ఆకర్షితులై డబ్బులు సమర్పించుకుంటున్నారు. రుణయాప్ ద్వారా లోన్ తీసుకున్న వారు తిరిగి చెల్లించలేక, నిర్వాహకులు పెట్టే వేధింపులు భరించలేక కొంతమంది ప్రాణాలు తీసుకుంటున్నారు. లోన్ యాప్ నిర్వాహకుల నుంచి రుణం పొందితే సకాలంలో డబ్బులు తిరిగి చెల్లించకున్నా.. ఆలస్యం చేసినా.. రుణగ్రహీతలు ఫొటోలను మార్ఫింగ్ చేసి వారి బంధువులకు, ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్‌కు పంపిస్తున్నారు. అలాంటి సమయంలో రుణ గ్రహీతలు అవమాన భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

అత్యాశకుపోయి.. ఉన్నది పోగొట్టుకుని..

ఈ మధ్యకాలంలో వాట్సాప్‌కు వచ్చే లింక్ మెసేజ్‌లను నొక్కి అటు నుంచి గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు వస్తాయనే ఆశ చూపగానే విడతల వారీగా డబ్బులను పంపించి నష్టపోతున్నారు. ఈ రకమైన మోసాల బాధితులే అత్యధికంగా పోలీసులు ఆశ్రయిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుల్లో రోజుకు ఒకటి, రెండైనా ఇలాంటివి ఉంటున్నాయి. మీరు పెట్టే డబ్బులు రెట్టింపు అవుతాయనగానే ఆలోచించకుండా డబ్బులు వేసి ఆ తర్వాత లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తుకుంటూ వెళుతున్నారు.



సైబర్ క్రైం కేసులు

వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఉన్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌తో పాటు మూడు జోన్‌లలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సైబర్ క్రైంకు గురైన బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో 142 కేసులు నమోదు కాగా, కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో 173 కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ నుంచి సమారు రూ.32 లక్షలకు పైగా బాధితులకు ఇప్పించగా, పోలీస్‌స్టేషన్ల నుంచి రూ.కోటి 30 లక్షల వరకు రీఫండ్ చేయించగలిగారు.

యాప్ మోసాలకు బలి..

- ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా రూ.1,60,000 కోల్పోయిన శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజుపల్లికి చెందిన ఆవుల దిలీప్.. పురుగుల మందు తాగి ఈ ఏడాది మే 31న ఆత్మహత్య చేసుకున్నాడు.
- లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఈ ఏడాది ఆగస్టు 31న మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ జన్మభూమి జంక్షన్ ప్రాంతానికి చెందిన విద్యార్థి కంభంపాటి విష్ణువర్ధన్ చీరతో ఉరి వేసుకొని బలవన్మరణం పొందాడు.
- భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు చెందిన రేషన్ డీలర్ గొడిశాల పైడయ్య ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో రుణం తీసుకొని ఈఎంఐ చెల్లించలేదు. లోన్ యాప్ నిర్వాహకులు ఒత్తిడి పెంచడంతో ఈ ఏడాది జూన్ 27న రేషన్‌షాపులోనే ఉరి వేసుకొని మరణించాడు.
- వర్ధన్నపేట కడారిగూడెంకు చెందిన బీటెక్ విద్యార్థి బత్తిని గణేశ్ ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం స్నేహితుల వద్ద అప్పు చేసి తీర్చలేక ఈ ఏడాది అక్టోబర్ 23న పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ 29న హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో మరణించాడు.
- డిసెంబర్ 16న వర్ధన్నపేట మండలం బండతౌపురానికి చెందిన మరుపట్ల హనూక్ (26) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో రూ.6లక్షలు పోగొట్టుకొని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



అడ్డదారులు తొక్కి కటకటాల్లోకి..

బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, వ్యక్తిగత అవసరాల కోసం ఆన్‌న్‌లైన్ లోన్‌యాప్‌లు ఆశ్రయించి రుణాలు తీసుకొని వాటిని తీర్చలేక కొందరు అడ్డదారులు తొక్కుతూ చివరికి చోరీలకు పాల్పడుతున్నారు. దీనిలో భాగంగా వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన కొండపల్లి ధర్మారాజు.. బిర్యానీ సెంటర్ నడిపి నష్టపోయాడు. అనంతరం హనుమకొండ రెవెన్యూకాలనీకి మకాం మార్చి అద్దె ఇంట్లో ఉన్నాడు. నష్టపోయిన డబ్బును తిరిగి పొందేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా సంపాదించాలని ప్లాన్ వేశాడు. వాటి ద్వారా ఇంకా నష్టపోయాడు. దీంతో దొంగగా మారి చోరీలు చేయడం ప్రారంభించాడు. ఇలా 13 చోరీలు చేసి చివరికి కేయూ పోలీసులకు చిక్కి జైలులో ఊచలు లెక్కపెడుతున్నాడు.



అలెర్ట్

లింకు నొక్కారో.. కాసులు కల్లాస్!

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- అవగాహన లేక కొందరు.. ఆశతో మరికొందరు
- ఇప్పటికే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వాళ్లు కోకొల్లలు
- స్వీయ జాగ్రత్తలతోనే సైబర్ నేరాల నియంత్రణ

లింగాలఘణపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మీ బ్యాంకు అకౌంట్ బ్లాక్ అయింది. మీ మొబైల్‌కు ఓటీపీ వస్తుంది చెప్పండి అంటూ బ్యాంకు అధికారుల పేరుతో తెలియని వ్యక్తులు కాల్ చేస్తుంటారు. మరికొందరికేమో మీరు లక్కీ డ్రాకు ఎంపికయ్యారు.. మేమడిగే అతి సులభమైన రెండు ప్రశ్నలకు సమాధానం చెప్పండి.. ఆతర్వాత మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పండి.. క్షణాల్లో ఇక లక్కీ డ్రా డబ్బులు మీ సొంతం అంటూ బురిడీ కొట్టిస్తారు. ఇటీవల ఇలాంటి ఫేక్ కాల్స్ ఎక్కువయ్యాయి. పొరపాటున వారి మాటలు నమ్మి ఓటీపీలు చెప్పారో.. నిజంగానే బ్యాంకులో ఉన్న మీ కాసులు కల్లాస్ అవ్వాల్సిందే. ఏం జరిగిందో తెల్సుకుని తేరుకునేలోపే సైబర్ నేరగాళ్లు మన ఖాతాల్లో డబ్బులను మాయం చేస్తారు.. సైబర్ నేరగాళ్లు ఇటీవల కాలంలో ఒక అడుగు ముందుకేసి ఖాతాల్లో ఉన్న డబ్బులను మాయం చేయడమే కాకుండా బ్యాంకు ఖాతాలతో లింక్ అయిన మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్‌ను బ్లాక్ చేస్తున్నారు. రోజు రోజుకు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇలాంటి సైబర్ నేరాల తీవ్రత కూడా అంతే స్థాయిలో పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఓ వైపు పోలీసులు, మరో వైపు స్వచ్ఛంద సంఘాలు సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రోజుకొక్కటి చొప్పున నేరాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నిరక్ష్యరాస్యులు పడుతున్నారేమో అనుకుంటే పొరపాటే.. అన్నీ తెలిసిన చదువుకున్న వారే.. వీరిలో బ్యాంకుల ఉద్యోగులు కూడా ఉంటుండటం గమనార్హం.

అవగాహన లేక కొందరు.. అత్యాశతో మరికొందరు..

పెరుగుతున్న సాంకేతికత, అందరి చేతిలోకి స్మార్ట్ ఫోన్లు అందుబాటులో రావడం, వాటికి తగ్గట్టుగా తక్కువ ధరలకే ఇంటర్నెట్ సేవలు అందుతుండటంతో ఎటు నుంచి ఏ సైబర్ కేటుగాడు మోసానికి పాల్పడతాడో అర్థం కాని పరిస్థితి. మారుమూల పల్లెల్లోని చిరుదుకాణాల నుంచి కార్పోరేట్ స్థాయి షాపింగ్‌లు, సూపర్‌మార్కెట్లలో సైతం కొనుగోళ్ల అమ్మకాలకు చెందిన ప్రతీ లావాదేవీని యూపీఐ అకౌంట్ ద్వారా చేస్తున్నారు. అయితే ఆర్థిక లావాదేవీలు చేస్తున్న ప్రతీ యూపీఐ చెల్లింపులన్నీ ప్రైవేటుకు చెందింది కావడంతో మన వ్యక్తిగత సమాచారం మొత్తం వాళ్ల వద్ద ఉండిపోతోంది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ మోసాలకు తెరలేపుతున్నారు. మెసేజ్, వాట్సాప్‌ల ద్వారా తప్పుడు లింకులు షేర్ చేస్తున్నారు. తెలిసీ తెలియక వాటిని నొక్కిన వెంటనే మన ఖాతాల్లోని డబ్బంతా మాయమైపోతోంది. వీటితో పాటుగా కొంతమంది నకిలీ వెబ్‌సైట్లను క్రియేట్ చేస్తుండటంతో స్మార్ట్ ఫోన్లకు వచ్చే బల్క్ వెబ్‌సైట్లలో నకిలీవి ఏవో.. అసలువి ఏవో తెలియక ప్రజలు మోసాలకు గురవుతున్నారు. ఇలాంటి సైబర్ మోసంలో చిక్కుకునే వాళ్లలో కొంతమంది ఏం తెలియని వారుంటుండగా మరికొందరు అత్యాశతో రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా ఎదగాలని అత్యాశతో నిండా మునుగుతున్నారు. కొందరు ఆదాయ పన్ను నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ మోసాల బారిన పడిపోతున్నారు. ఇంకొంతమంది యువత ఆన్‌లైన్ గేమ్ మోజులో పడి ఖాతాలను గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ గేముల్లో మొదట గెలిచినట్టు అవకాశం కల్పించి రెట్టింపు డబ్బులు చెల్లించి పూర్తిగా నమ్మించిన తర్వాత ఖాతాలో ఉన్న డబ్బును మొత్తం మాయం చేస్తున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో ఓ యువకుడుపెద్ద మొత్తంలో తన డబ్బును పోగొట్టుకున్నట్టు సమాచారం.

- జనగామ జిల్లాలో జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు బలై రూ. లక్షల్లో మోసపోయాడు. అదేవిధంగా టీజీఎస్‌పీడీసీఎల్‌లో పనిచేసే ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మోసానికి రూ. 89వేలు పోగొట్టుకున్నారు. లింగాలఘణపురం మండలానికి చెందిన ఓ గ్రామపంచాయతీ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల కారణంగా తన ఖాతాలోని రూ. 40వేలు మాయం చేసుకున్నాడు.



సైబర్ మోసాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్మెట సీఐ అబ్బయ్య(ఫైల్)

అపరిచితులకు వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు



అపరిచిత వ్యక్తులు పంపే లింకులను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు. అదేవిధంగా ఎవరైనా ఫోన్ చేసి ఆధార్‌నెంబర్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఓటీపీ అడిగితే ఎవరికి కూడా షేర్ చేయకూడదు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు అనేక రూపాల్లో స్మార్ట్ ఫోన్‌ద్వారా మోసం చేసేందుకు సిద్ధంగా ఉంటారు. అటువంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, జనగామ రూరల్



సైబర్ అంబాసిడర్‌గా మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని(ఫైల్)

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కకుండా జాగ్రత్తలు ఇలా పాటించాలి..

- సైబర్‌క్రైం జరిగిన వెంటనే / 24 గంటల లోపు 1930కి ఫోన్ కాల్ చేసి సమాచారమివ్వాలి. లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలి.
- వెబ్‌సైట్‌లు అసలువా లేక నకిలీవా అని తెల్సుకునేందుకు http:///www.getsafeonline.org లో నిర్ధారించుకోవాలి
- మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులు తొందరపడకుండా జాగ్రత్తగా గమనించి ఓపెన్ చేయాలి
- థర్డ్‌పార్టీ అప్లికేషన్లు ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయొద్దు



- బహుమతి వచ్చిందని ఎస్ఎంఎస్‌లు వస్తే నమ్మిమోసపోవద్దు
- అపరిచితులకు తమ ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఇవ్వకుండా ఉండాలి
- యూపీఐల ద్వారా డబ్బులు చెల్లించే ఖాతాల్లో వీలైనంత మేరకు తక్కువ డబ్బులను ఉంచుకోవడం శ్రేయస్కరం.
- ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సైబర్ వారియర్లను ప్రభుత్వం నియమించింది. వారిని సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు



మొగిలయ్య భౌతిక కాయం

మొగిలయ్య(ఫైల్)

మూగబోయిన జానపద ఝరి

'బలగం' మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. ముగిసిన అంత్యక్రియలు

దుగ్గొండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జానపద కళాకారుడు, 'బలగం' ఫేమ్ పస్తం మొగిలయ్య (67) కన్నుమూశారు. రెండేళ్లుగా రెండు మూత్రపిండాలు ఫెయిలై తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కాగా, మొగిలయ్య స్వస్థలంలో మొగిలయ్య భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50వేలు మొగిలయ్య భార్య కొమురమ్మకు అందించారు. అదేవిధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు టీపీసీసీ కార్యదర్శి బొమ్మెనపెల్లి అశోక్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించి రూ.50 వేలు ఆర్థికసాయం చేశారు. బలగం సినిమాలో నటించిన రచ్చ రవి, బాలు సందర్శించి నివాళులర్పించారు. తెలంగాణ సాంస్కృతిక కళాబృందం సభ్యులైన యోచన, తాళ్ల సునీల్ నివాళులర్పించారు. స్థానిక నాయకులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. కాగా, మొగిలయ్యను చూడడానికి కులస్థులు, వివిధ గ్రామాలకు చెందిన పలువురు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం మధ్య క్రైస్తవ మతఆచారం ప్రకారం మొగిలయ్య అంత్యక్రియలు ముగిశాయి.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న రచ్చ రవి, బాలు

సంప్రదాయ కళతో..



వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన పస్తం మొగిలయ్య (67), కొమురమ్మ దంపతులు జానపదాలు, బుర్రకథలు చెబుతూ జీవనం సాగించారు. పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తున్న జానపద కళల్లో ఒకటైన బుర్ర కథలే వృత్తిగా ఎంచుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు గోదావరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో బుర్ర కథలు చెప్పేవారు. నిరక్షరాసులైనా కళలో ప్రత్యేక గుర్తింపు పొందారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని కేశవపురానికి చెందిన పస్తం వెంకటయ్య - లక్ష్మిలకు 10 మంది సంతానం. వీరిలో నలుగురు కుమా రులు, ఆరుగురు కుమార్తెలున్నారు. రెండో కుమారుడైన పస్తం మొగిలయ్య అదే గ్రామానికి చెందిన మేనమామ కడేం హన్మంతు-జానవ్వల కుమార్తె కొమురమ్మను 45ఏళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు సుదర్శన్ ఉండగా, తన సోదరుడైన పస్తం రవి కుమార్తె మొజేష్‌ను దత్తత తీసుకున్నారు. ఊరూరా తిరుగుతూ కథలు చెబుతూ మొగిలయ్య కుటుంబం కొన్నేళ్ల కిందట దుగ్గొండికి వలస వచ్చి స్థిరపడింది. ఇందిరమ్మ కాలనీకి చెందిన గృహాన్ని కొనుగోలు చేసి నివాసంగా ఉంటున్నారు. కుమారుడు సుదర్శన్ స్టీల్ సామాన్లు కొనుగోలు వ్యాపారం చేస్తున్నాడు. దత్త కుమార్తెకు వివాహం కావడంతో అత్త వారింట్లో ఉంటోంది.

అప్పటికపుడు కథలు, పాటలు

దంపతులిద్దరూ నిరక్షరాసులైనా కథలు, పాటలు అల్లుకుని పాడడం, చెప్పడం వారి ప్రత్యేకత, శకుంతల, దమయంతి, కాంబోజురాజు, అంజమ్మ తదితర కథలు చెప్పడంలో సిద్ధహస్తులు, ఏ ఊరికి వెళ్లినా ఆ ఊరిలో డేరాలు వేసుకొని కొన్ని రోజులు అక్కడే ఉంటూ కథలు చెబుతూ.. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబం నెట్టుకొచ్చేవారు.



మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

బలగం సినిమాతో ప్రత్యేక గుర్తింపు

మూడేళ్ల కిందట మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడలోని ఓ ఇంటి వద్ద మొగిలయ్య దంపతుల బుర్ర కథను విన్న రాజమౌళి అనే వ్యక్తి ఈ విషయాన్ని తన బంధువైన బలగం సినిమా దర్శకుడు యెల్దండి వేణుకు తెలిపారు. దీంతో వేణు కొత్తగూడకు చేరుకొని వారి కథను, పాటలను విన్నాడు. తాను తీస్తున్న బలగం సినిమా క్లైమాక్స్ లో పాట పాడేందుకు అవకాశం కల్పించారు. సినిమా విజయవంతం కావడంతో మొగిలయ్య దంపతులకు మంచి గుర్తింపు వచ్చింది.



మొగిలయ్య దంపుతులను సన్మానిస్తున్న బలగం సినిమా డైరెక్టర్ వేణు(ఫైల్)

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి ★★
గ్రేటర్ వరంగల్ 5
శుక్రవారం 20 డిసెంబరు 2024



జీవితాలతో 'సెల్'గాటం!

ఆన్‌లైన్ మోసాలకు బలవుతున్న అమాయకులు

- బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వలలో యువత
- అవసరాల కోసం రుణ యాప్‌లపై పేదల మొగ్గు
- ఉచ్చులో పడుతున్న అమాయకులు
- బయట పడలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- మెసేజ్, లింక్‌లకు స్పందించొద్దని సూచన
- మోసపోతే 1930ను సంప్రదించాలని సలహా

7



ప్రస్తుతం సెల్‌ఫోన్ మానవుడి దైనందిన జీవితంలో ఒక భాగమైంది. సెల్‌ఫోన్ లేనిదే గడపలేని పరిస్థితి నెలకొంది. చేసే పనిలో కొంత విరామం దొరికినా.. లేదా కాలక్షేపం కోసమైనా సెల్ ఫోన్ చూసుకునే రోజులున్నాయి. ఈ క్రమంలో కొందరు ఆన్‌లైన్‌లోకి తొంగిచూస్తున్నారు. బెట్టింగ్‌లు, గేమింగ్‌లు, లింకులు, ఇన్వెస్ట్‌మెంట్, మోసపూరిత ఉద్యోగ ప్రకటనలపైకి దృష్టి మరల్చి జీవితాలను ఆగం చేసుకుంటున్నారు. కొంతమంది యువత తల్లితండ్రులకు తెలియకుండానే వారి ఖాతాల్లోని డబ్బులను బెట్టింగ్, గేమింగ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగం వస్తుందేమోననే ఆశతో మోసపూరితమైన ప్రకటనలకు ఆకర్షితులమవుతున్నారు. అందులో విడతల వారీగా డబ్బులు పెట్టి చివరికి మోసపోయామని తెలుసుకొని జరిగిన నష్టాన్ని పూడ్చలేక విగత జీవులుగా మారుతున్నారు. ఈ నేపథ్యంలో లింక్‌లు, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. డబ్బు పోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. రూ.10 లక్షలకు పైగా మోసపోతే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో, ఆలోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలోనే ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు.

- వరంగల్ క్రైం

మూగబోయిన జానపద ఝరి

బలగం మొగిలయ్య కన్నుమూత

- అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస
- పలువురి నివాళి.. భార్యకు ఆర్థిక సాయం
- దుగ్గొండిలో ముగిసిన అంత్యక్రియలు

ఆయన గొంతెత్తితే గాన మాధుర్యమే.. జానపదాలు చెబితే గంటల తరబడి రెప్పవాల్చకుండా చూడాల్సిందే.. పద్యం అందుకుంటే గుండెలు గిల్లుమనాల్సిందే.. ఆయనే.. బుడిగ జంగాల సామాజిక వర్గానికి చెందిన పస్తం మొగిలయ్య. సంచలన విజయం సాధించిన బలగం సినిమాలో పతాక సన్నివేశంలో మానవ సంబంధాల ఔనత్యాన్ని వివరిస్తూ చేసిన ఆయన గానం ప్రేక్షకుల కంట తడిపెట్టించింది. బలగం సినిమాకు ఆ సన్నివేశమే హైలైట్‌గా నిలిచింది. దీంతో మొగిలయ్య పేరు తెలుగువారందరికీ సుపరిచితమైంది. అంతలా ప్రేక్షకులతో కన్నీరు పెట్టించిన మొగిలయ్య అనారోగ్యంతో గురువారం కన్ను మూశారు. స్వస్థలం దుగ్గొండిలో అంత్యక్రియలు ముగిశాయి.

- దుగ్గొండి

7





సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సాట్ చైర్మన్ శివసేనారెడ్డి

నిష్ణాతులైన కోచ్‌లు తయారు కావాలి..

- ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచేలా క్రీడాకారులకు తర్ఫీదునివ్వాలి
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడలు
- వర్చువల్‌గా పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్స్‌లో క్రీడల్లో పతకాలను తీసుకవచ్చే క్రీడాకారులను తయారుచేసే ప్రతిభ కలిగిన కోచ్‌లు రాష్ట్రం నుంచి అందుబాటులోకి రావాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) చైర్మన్ శివసేనారెడ్డి కోరారు. గురువారం హనుమకొండ జేఎన్‌ఎస్ క్రీడా మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమానికి శివసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారదతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం శివసేనారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి నిష్ణాతులైన కోచ్‌లను తయారు చేసి వారి ద్వారా క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి ఒలంపిక్స్‌లో పతకాలను సాధించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలోని మాణిక్యాలను వెలికితీసి క్రీడల్లో రాణించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. సీఎం కప్ క్రీడాపోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన 10మంది క్రీడాకారులను ప్రత్యేక క్యాంపునకు ఎంపిక చేసి శిక్షణ అందించి ఏషియన్ గేమ్స్‌కు పంపిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలవైపు ప్రోత్సహించడంవల్ల చెడు అలవాట్లకు దూరమవడమే కాకుండా క్రమ శిక్షణ పెంపొందుతుందన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన జివాంజీ దీప్తి పారా ఒలంపిక్స్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించి ఉన్నత శిఖరాలను చేరుకుందని గుర్తు చేశారు. ప్రతీ మండల, జిల్లా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో క్రీడా మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందించే విధంగా ప్రయత్నాలు చేపడుతామన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ములుగులో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తామని శివసేనా రెడ్డి పేర్కొన్నారు. ఇన్‌చార్జి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడానికి సీఎం కప్ వేదికగా మారిందన్నారు. ముంబయికి చెందిన క్రీడా నిపుణుల బృందం జేఎన్‌ఎస్‌ను సందర్శించి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ ఆధారంగా వారికి సలహాలు, సూచనలు, మెళకువలు నేర్పిస్తుందన్నారు. డీవైఎస్‌వో అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని జిమ్నాస్టిక్స్‌హాల్‌లో రాష్ట్రస్థాయి బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, పీఈటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రూ, డీఎస్ఏ కోచ్‌లు, పీటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్‌గా పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హనుమకొండ జేఎన్‌ఎస్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే వర్చువల్‌గా పాల్గొన్నారు. మైదానం లో ఏర్పాటు చేసని స్క్రీన్‌లో వర్చువల్‌గా వీడియో ద్వారా మాట్లాడారు. రెవెన్యూ, హౌజింగ్, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. క్రీడల వల్ల నాయకత్వపు లక్షణాలు పెంపొందుతాయన్నారు. పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఓరుగల్లులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారని కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న జిమ్నాస్టిక్స్ పోటీల్లో 200మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, పీఈటీలు పాల్గొన్నారన్నారు. రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి దోహపడుతాయన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్

ఎస్సీ వర్గీకరణ వినతులపై నివేదిక అందజేస్తాం..

- ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్
- హనుమకొండ కలెక్టరేట్‌లో విచారణ
- ఎస్సీ కుల సంఘాల నుంచి 135 వినతుల స్వీకరణ

6



ఆజంజాహీ స్థలం కార్మికులకే చెందేలా చూస్తా..

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు
- యూనియన్ కార్యాలయ స్థలంలో పనుల నిలిపివేత

6



కార్మిక భవనం వెంటనే నిర్మించాలి

- కబ్జాదారులకు అండగా అధికార పార్టీ నేతలు
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



కార్మిక భవనానికి శంకుస్థాపన చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
- అనుమతుల రద్దు కోసం కమిషనర్‌కు నేతల వినతి

రైల్వే స్టేషన్‌లో పనులు వేగవంతం చేయాలి

- సికింద్రాబాద్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్
- వరంగల్‌లో రైల్వే అధికారుల క్వార్టర్లు ప్రారంభం



వరంగల్ రైల్వేస్టేషన్‌లో రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

గిర్మాజిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమృత్‌భారత్ అభివృద్ధిలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన విజయవాడ - కాజీపేట రైల్వే మార్గంలోని వివిధ అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులను డీఆర్‌ఎం తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక రైలులో వరంగల్‌కు చేరుకున్న డీఆర్‌ఎం.. వరంగల్ రైల్వేస్టేషన్‌లో రూ.4కోట్లతో నిర్మించిన తొమ్మిది రైల్వే అధికారుల క్వార్టర్లను రాత్రి ప్రారంభించారు. ఆర్పీఎఫ్ బ్యారక్ వెనుక నిర్మించిన టైప్ 2 క్వార్టర్లు 4, టైప్ 3 క్వార్టర్లు నాలుగింటిని ప్రారంభించారు. అక్కడే కొన్ని మొక్కలు నాటారు. అలాగే పీడబ్ల్యూఐ అధికారి టైప్ 4 క్వార్టర్‌ను ప్రారంభించారు. నాలుగో ప్లాట్‌ఫామ్ నుంచి నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటి ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన జనరల్ ప్రయాణికుల విశ్రాంతి మందిరాన్ని పరిశీలించారు. అలాగే నిర్మాణంలో ఉన్న కోచ్ రెస్టారెంట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి సత్వరం ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా పనులు వేగవంతం చేయాలని చెప్పారు.

అనంతరం డీఆర్‌ఎం జైన్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను మే నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైల్వేస్టేషన్‌లోని జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసుస్టేషన్లను ప్లాట్‌ఫామ్ లెవెల్‌కు పెంచి నూతనంగా నిర్మించనున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులు అలస్యం కాకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్‌ఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఈఎన్ (సౌత్) దినకర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వై.బాలాజీ కిరణ్, వరంగల్ సీసీఐ రాజ్‌గోపాల్, ఆర్పీఎఫ్, జీఆర్పీ ఎస్సైలు వెంకటేశ్వర్లు, మోహినుద్దీన్, వివిధ విభాగాల రైల్వే అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

హసన్‌పర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు హాస్టల్స్ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రైవేటు హాస్టల్స్ యజమానులకు సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా హనుమకొండ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక భీమారం శుభం కల్యాణ వేదికలో హనుమకొండలోని ప్రైవేటు హాస్టల్స్ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా హాస్టల్‌కు వచ్చిపోయే వారి వివరాలను ఎప్పటికప్పుడు నోట్ చేసుకోవాలని, అంతేకాకుండా హాస్టల్స్‌లో ఉండే వారి దినచర్యపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వారిని బయటికి వెళ్లేందుకు అనుమతించవద్దని, వీరి కోసం వచ్చే వారి గురించి తగిన సమాచారం తీసుకోవాలన్నారు. హాస్టళ్లలో సమస్యలు ఉంటే ఈ నెల 31 వరకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జనవరి నుంచి హాస్టల్స్ ముమ్మరంగా తనిఖీలు చేస్తామన్నారు. పోలీసుల సూచనలు పాటించని హాస్టల్స్‌పై చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ భట్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సతీష్, సుంకరి రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- వరంగల్‌లో ప్రజాసంఘాల మండిపాటు
- బల్దియా ఆవరణలో నిరసన

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ పార్లమెంట్ సాక్షిగా అనుచిత వాఖ్యలు చేసిన దేశ హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వాపమపక్ష కార్మిక ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా దేశంగా రాజ్యాంగబద్ధంగా కొనసాగే పార్లమెంట్‌లో రాజ్యాంగ రచనకు ప్రాణం పోసిన అంబేద్కర్‌కు గౌరవం ఇవ్వని అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టాలని బీజేపీ ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...



బల్దియా ఆవరణలో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ఇందిరమ్మ ఇళ్ల కమిటీపై పునరాలోచించాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్

ఖిలావరంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఎంపికలో పార్టీ సీనియర్లను విస్మరించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆరోపించారు. గురువారం 34వ డివిజన్ శివనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 30ఏళ్లుగా కాంగ్రెస్‌నే నమ్ముకొని పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానన్నారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తనపై బెదిరింపులు, పోలీస్ కేసులతో పాటు జైలు పాలయ్యానన్నారు. మంత్రి కొండా సురేఖ గెలుపు కోసం తాను ఎంతగానో కృషి చేశానన్నారు. అయితే బీఆర్‌ఎస్ కాలంలో తనపై దాడి చేసిన వారికే ఇందిరమ్మ కమిటీలో చోటు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ - మురళీధర్‌రావులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ విషయంలో పునరాలోచించాలని కోరారు. అలాగే ఇటీవల పార్టీలు మారిన వారికే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ పేర్లు రావడం తగదన్నారు. తనను నమ్ముకున్న వారికి కమిటీలో తగిన ప్రాధాన్యం ఇవ్వకుంటే హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రాలిచ్చి గాంధీ భవన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజమ్మ, సంతోషిణి, కె.ఉమాదేవి, మాధవి, అజీరా, రమ, స్వరూప, బి.వెంకన్న, రమేష్, పాము వెంకన్న, ప్రదీప్, మస్తాన్ పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్

1008 మందితో అనఘాష్టమి వ్రతం



➡ 23న నిర్వహణకు ఏర్పాట్లు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు అనుగ్రహించే వ్రతం అనఘాలక్ష్మి దేవి వ్రతం. దత్తాత్రేయ స్వామి యోగా మూర్తిని అనఘాస్వామిగా దత్తత్రేయ స్వామి యోగా శక్తిని అనఘాదేవిగా వారి కుమారులుగా అష్టసిద్ధులతో కూడిన పురాణ వ్రతం అనఘాష్టమి వ్రతం. ఈ వ్రతాన్ని దేవతలు సైతం ఆచరించారు. తమ సమస్యల పరిష్కారానికి ఈ వ్రతం ఆచరిస్తే అనుగ్రహం కలుగుతుందని పురాణాల కాలం నుంచి ప్రసిద్ధి. నాటి నుంచి నేటి వరకు ప్రతీ అష్టమి రోజు ఆలయాలు, భక్తుల ఇళ్లల్లో నిర్వహించుకుంటున్నారు.

అందరూ ఆచరించవచ్చు..

అనఘాష్టమి వ్రతాన్ని ప్రతీ ఒక్కరు ఆచరించుకోవచ్చు. వివాహం కాని వారు, ఆర్థిక సమస్యలు ఉన్న వారు, అనారోగ్యం బారిన పడినవారు, ముత్తైదువులు, యువతులు, వితంతువులు కూడా అనఘాష్టమి వ్రతాన్ని ఆచరించుకోచ్చని అవధూత దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ చెప్పారు.

బహుళాష్టమిన ప్రధాన వేడుక

ప్రతీ సంవత్సరం మార్గశిర మాసం, ధనుర్మాసంలో వచ్చే బహుళాష్టమి రోజు ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని దేశ వ్యాప్తంగా కార్తవీర్యార్జునుడు అనే రాజు ప్రజలందరితో ఆచరింప చేశారు. త్రేతాయుగంలో రాముడు ఆచరించారు. ద్వాపార యుగంలో కృష్ణుడు పాండవులతో ఈవ్రతాన్ని నిర్వహించారు. కృతాయుగంలో దత్తాత్రేయ స్వామి భక్తులతో చేయించారని, ప్రస్తుత కాలంలో మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ భక్తులు భారత దేశ వ్యాప్తంగా ఆశ్రమాలు, దేవాలయాలు, లక్షలాది మంది భక్తుల ఇళ్లల్లో ఈ వ్రతాన్ని ఆచరించుకుంటారు. 2022లో హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వామిజీ సమక్షంలో 50 వేల మంది భక్తులు ఆచరించుకున్నారు.

వ్రత నిర్వహణకు సిద్ధమవుతున్న వరద దత్తక్షేత్రం

ఈ నెల 23న సోమవారం ప్రధాన అనఘాష్టమిని పురస్కరించుకొని ములుగు రోడ్‌లోని వరద దత్తక్షేత్రంలో అనఘా మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో 1008 మంది భక్తులతో వ్రతాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతీ రోజు భక్తులు ఆచరిస్తారు..

అనఘాష్టమి వ్రతాన్ని ప్రతీ రోజు భక్తులు తమ ఇళ్లల్లో ఆచరించుకుంటారని, ప్రతీ అష్టమి రోజు ఆలయాల్లో నిర్వహిస్తామని ప్రతీ సంవత్సరం ధనుర్మాసంలో వచ్చే ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని వేలాది మందితో వరంగల్ ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్రతం అనంతరం భక్తులందరికి అన్నదానం చేయనున్నామని, ప్రతీ ఒక్కరు ఆచరించుకోవచ్చని తెలిపారు.

కొక్కుల రాజేంద్రప్రసాద్, దత్త ప్రచారక్



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

వరంగల్ మెడికల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డీఎంహెచ్‌వో కార్యాలయం ముందు గురువారం నిరసన కార్యక్రమం చేశారు. ఈ క్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌వోలకు వినతిపత్రాలను అందజేశారు. 48 గంటల నిరసనలో భాగంగా వంటావార్పు చేసి, కార్యాలయం ముందే నిద్రించారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ మాట్లాడుతూ..

వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని రెండేళ్లుగా పోరాడుతున్నా పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం గతంలో త్రిసభ్య కమిటీ నియమించిందని, కమిటీ రిపోర్టు లేకుండా రాత పరీక్ష తేదీలు ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వం రాత పరీక్షను వాయిదా వేయాలని, లేకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు సుధాకర్, శ్రీనివాస్, సుజాత, సరోజ, చంద్రకళ, ప్రభావతి, సాంబలక్ష్మి, మంజుల, పుష్పలత, విజయ, కవిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సీఎం కప్ క్రీడలు

రేపు ముగియనున్న జిల్లాస్థాయి పోటీలు



సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవిత

కాశిబుగ్గ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు హోరాహోరీ జరుగుతున్నాయి. మైదానాలు క్రీడాకారులతో సందడిగా మారాయి. ఈనెల 17న ప్రారంభమైన ఈ పోటీలు శనివారం ముగియనున్నాయి. గురువారం బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, ఖో-ఖో పోటీలు ఉత్కంఠగా సాగాయి. పైడిపల్లిలోని జడ్పీహెచ్ఎస్ మైదానంలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీలను కార్పొరేటర్ జన్ను షీభారాణి, సీకేఎం కళాశాల మైదానంలో జరిగిన సైక్లింగ్ పోటీలను 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత ప్రారంభించారు. డీవైఎస్‌వో సత్యవాణి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌ల పర్యవేక్షణలో క్రీడలు నిర్వహించారు.

భద్రకాళి ఆలయంలో నవ చండీయాగం



యాగం నిర్వహిస్తున్న పూజారులు, పాల్గొన్న జీఎంఆర్ నిర్వాహకులు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): భద్రకాళి అమ్మ వారి దేవాలయంలో గురువారం నవచండీ యాగం నిర్వహించారు. అర్చకుడు శేషు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించిన నవ చండీయాగంలో ప్రముఖ నిర్మాణ సంస్థ జీఎంఆర్ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌ నిర్మాణ సంస్థ) నిర్వాహకులు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. యాగ నిర్వహణ అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తూకంలో లీగల్ మెట్రాలజీ అమోదం తప్పనిసరి

» వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి » ఏనుమాముల మార్కెట్లో చైతన్య సదస్సు



ఏనుమాముల మార్కెట్లో తూకం యంత్రాలను పరిశీలిస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

వరంగల్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పంట సరుకుల తూకం యంత్రాలపై 'లీగల్ మెట్రాలజీ అమోదం' తప్పసరిగా ఉండాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో లీగల్ మెట్రాలజీ రూల్స్ 2011 సవరణలపై చైతన్య సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శి అంజిత్‌రావు, హైకోర్టు అడ్వకేట్ మురారి యశ్వంత్‌కుమార్, మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రావుల రంజిత్ కుమార్, చిలువేరు ప్రవీణ్, ఏఎస్ రాజేందర్, సూపర్‌వైజర్లు మురళీ, గంగాధర్ పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ రూల్స్ ప్రకారం తూనికలు, కొలతలపై లీగల్ మెట్రాలజీ స్టాంపింగ్ ఉండాలని చక్రపాణి వివరించారు. వినియోగదారుల రక్షణ చట్టం -2019 పరిధిలో రైతులు కూడా వినియోగదారులుగా పరిగణింపబడుతారని చెప్పారు. ఈ సందర్భంగా మార్కెట్లోని యంత్రాలను పరిశీలించారు. అనంతరం వినియోగదారుల చైతన్య సదస్సులకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.



నిందితుడి అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతి

గొలుసు చోరీ నిందితుడి అరెస్ట్

వరంగల్ సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కిరాణాషాపులో సిగరెట్లు కొనుక్కోవడానికి వచ్చి మహిళపై కారం చల్లి మెడలోని పుస్తెలతాడును తెంపుకొని పారిపోయిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గురువారం మామునూర్ ఏసీపీ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన హుకుం సింగ్(23) క్యాలిక్యులేటర్లు రిపేరు చేసే నెపంతో షాపులను రెక్కీ చేసేవాడు. ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. రెండు నెలల కిందట సిద్దిపేటలో రూమ్ కిరాయికి కావాలని వచ్చి ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో ఉన్న చైన్‌ను దొంగించి పారిపోయాడు. అలాగే ఈనెల 10న ఏనుమాముల ఇందిరమ్మ కాలనీలోని కిరాణా షాపులో సుమలత ఒంటరిగా ఉండడాన్ని గమనించాడు. సిగరెట్ కావాలని అడిగి చిల్లర ఇస్తుండగా మహిళ ముఖంపై కారంపొడి చల్లి పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. బుధవారం ఏనుమాముల పోలీసులు నిందితుడు హుకుం సింగ్‌ను పట్టుకుని రెండున్నర తులాల బంగారు గొలుసును రికవరీ చేశారు. నిందితుడిని పట్టుకున్న సీఐ రాఘవేందర్, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

ఏనుమాములలో నిలిచిన కొనుగోళ్లు

» సాఫ్ట్‌వేర్ సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడ్డ రైతులు

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం ఈఆర్‌పీ సాఫ్ట్‌వేర్ సర్వర్ పనిచేయక పోవడంతో మిర్చి, ఇతర పంట సరుకుల కొనుగోళ్లు నిలిచిపోయాయి. మూడు గంటల పాటు సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఏటా వందల కోట్ల క్రయవిక్రయాల జరిగే మార్కెట్లో తూకం వేసే పీవోఎస్ మిషన్లు, వైఫై, దానికి సంబంధించిన సర్వర్లు పనిచేయడం లేదు. గతంలో పలుమార్లు మంత్రులు, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులకు చాంబర్ ఆఫ్ కామర్స్, రైతు సంఘాలు, దడువాయి కార్మికులు విజ్ఞప్తులు చేశారు. అయినా మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు జాప్యం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప రైతుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకోవడం లేదని రైతు సంఘాలు మండి పడుతున్నాయి. రెండు రోజుల కిందటే చాంబర్ ఆఫ్ కామర్స్ మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు లేఖ రాసినా స్పందన లేకుండా పోయిందని చాంబర్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు ఏటా పన్ను రూపేణా రూ.50 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నా మార్కెట్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు చొరువ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య

కరీమాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పార్టీలో ఉంటూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ముక్కెర రామస్వామి, మాలోతు సాగర్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బహిష్కరణకు గురైన వారు పార్టీపై చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలన్నారు. వీరు పార్టీలో ఉంటూ చేసిన అవినీతి, అక్రమాలపై వచ్చిన ఆరోపణలకు రాష్ట్ర కమిటీ విచారణ చేసి, బహిష్కరించినట్లు తెలిపారు. పార్టీపై వీరు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని తెలిపారు.

అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

• ప్రజా, దళిత సంఘాల నాయకుల డిమాండ్
• కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనం

ఖిలావరంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రజా, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. గురువారం ఖిలావరంగల్ చెమన్ వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా ఎంపికై పార్లమెంట్ సభ్యుడిగా ఉండి అంబేద్కర్‌ను గేలి చేసి మాట్లాడడం బ్రాహ్మణీయ ఆధిపత్య ధోరణికి నిదర్శనమన్నారు. అణగారిన వర్గాలకు వివిదవర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ అంబేద్కర్‌కే చెల్లుతుందన్నారు. రాజ్యాంగ హక్కులను హరించి ప్రజాస్వామ్య వ్యవస్థను రద్దు చేసి అధ్యక్ష తరహా పాలన వ్యవస్థను తీసుకురావడానికి కుట్ర చేస్తోందని, ఇందులో భాగమే జమిలీ ఎన్నికలని ఆరోపించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఫాసిస్టు పరిపాలన విధానాలను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడానికి ఇలాంటి దుర్మార్గాలకు ఒడిగడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, టీపీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, మైదం సంజీవ, అంబేద్కర్ సంఘం నాయకులు మోహన్, మానవ హక్కుల వేదిక నాయకులు పాలకుర్తి సత్యం, మైదం పాణి, బండి కుమారస్వామి, పీవైఎల్ జిల్లా నాయకులు హరిబాబు, ఇనుముల కృష్ణ, ఎమ్డీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా, దళిత సంఘాలు

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

» పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ » బూత్ కమిటీల నియామకం

కాశిబుగ్గ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ పేర్కొన్నారు. బీజేపీ సంస్థాగత పర్వం (2024) కార్యక్రమంలో భాగంగా గురువారం 94వ బూత్ అధ్యక్షుడిగా ముచ్చర్ల ప్రభాకర్, 78వ బూత్ అధ్యక్షుడిగా కందుకూరి శ్రీనివాస్, 75వ బూత్ అధ్యక్షుడిగా ఆడెపు రవిరామ్ తేజతో పాటు మరికొన్ని బూత్ కమిటీలను నియమించారు. నూతనంగా నియమితులైన వారిని ఆయన శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు సముద్రాల పరమేశ్వర్, పార్టీ ఎన్నికల అధికారి గడల కుమార్, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, రఘునారెడ్డి, 19వ డివిజన్ అధ్యక్షుడు మామిడాల సతీష్, అజయ్, సుదర్శన్, రాము, కరుణాకర్, కోటి, రతన్ తదితరులు పాల్గొన్నారు.



బూత్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న రవికుమార్, చిత్రంలో బీజేపీ నాయకులు

భారతదేశాన్ని ఆదర్శంగా నిలుపుతున్న మోదీ

శంభునిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత దేశాన్ని ప్రపంచానికే ఆదర్శంగా చూపటానికి ప్రధాని నరేంద్ర మోదీ విరామం లేకుండా పనిచేస్తున్నారని అందుకే దేశ ప్రజలంతా మోదీ వెనుక నిలబడుతున్నారని బీజేపీ వరంగల్ జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్, కూచన క్రాంతి, కర్నె రవీందర్ అన్నారు. 41వ డివిజన్ అధ్యక్షుడు కర్నె వాసుదేవ్ అధ్యతన గురువారం విశ్వనాథకాలనీలోని పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో బూత్ కమిటీ అధ్యక్షులను నియమించారు. పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతంగా చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గంధి గోపి, జనార్దన్, సుదర్శన్, సాంబరాజు, తిరుపతి, రవికుమార్, నిహారిక, మురళి, దేవిక, దేవేందర్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ 41వ డివిజన్ కమిటీ సభ్యులు



విద్యార్థిని ఆశ్రితకు ప్రశంసాపత్రం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవవర్మ

విద్యార్థికి గవర్నర్ అభినందన

పోచమ్మమైదాన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని బొల్లపెల్లి అశ్రితను గవర్నర్ జిష్ణుదేవవర్మ అభినందించారు. ఎస్‌వోఈ (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్) ద్వారా ఎంపికై గత సంవత్సరం ఇస్రోను సందర్శించి ఇస్రోకి ఫీడ్‌బ్యాక్ ఇచ్చి ప్రతిభ కనబర్చిన గ్రేటర్ వరంగల్ ఆరెపల్లిలోని జ్యోతిబా పూలే పాఠశాలలో టెన్త్ పూర్తి చేసింది. గవర్నర్ జిష్ణుదేవవర్మ గురువారం హైదరాబాద్‌లో అశ్రితకు ప్రశంసాపత్రం అందజేశారు. అశ్రిత ప్రస్తుతం మేధా చారిటబుల్ ట్రస్టులో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఈ కార్యక్రమంలో ఎంజేపీ సెక్రటరీ సైదులు, ఆర్సీవో రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాట్య గురువుగా హిమాన్సీ

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి కాట్రగడ్డ హిమాన్సీకి జాతీయ స్థాయిలో ఉత్తమ నాట్య గురువుగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకోవడం విశేషం. నగనలూరు సభ, ప్రియా ఆర్ట్స్ సొసైటీ సంయుక్తంగా బుధవారం చెన్నైలో నిర్వహించిన మార్గాజీ సీజన్ అన్యూవల్ మ్యూజిక్ డాన్స్ అవార్డు ఫెస్టివల్‌లో దేశం నలుమూలల నుంచి సంగీతం, నృత్యం, వాయిద్య రంగాల్లో ఉత్తమ కళాకారులను వారి ప్రతిభా ఆధారంగా ఎంపిక చేసిన క్రమంలో తెలంగాణ నుంచి నృత్య రంగం లో హిమాన్సీ ఎంపికైంది. ఉత్తమ గురు, ఉత్తమ పెర్ఫార్మర్ అవార్డులను పద్మశ్రీ డాక్టర్ చిత్ర విశ్వేశ్వరన్, అనితగుహ లాంటి జాతీయ ప్రముఖ కళా కా రుల చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఇటీవల టెంపుల్ డాన్స్ స్కూళ్లు స్థాపించి ఎందరో విద్యార్థులకు హిమాన్సీ శిక్షణ ఇస్తుంది.

ఇంటర్నేషనల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



మురుగన్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 19 : (ఆంధ్ర జ్యోతి) : ఈ నెల 14నుంచి 19 వరకు థాయిలాండ్ దేశంలోని ఖావోలాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఫెడరేషన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూడీటీఏ)కు చెందిన సభ్యులు భారతదేశం తరుపున ప్రాతినిథ్యం వహించి టెన్నిస్ చాంపియన్‌షిప్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. కాగా, డబ్ల్యూడీటీఏకు చెందిన మురుగన్ 55ప్లస్ సింగిల్స్‌లో విజయ కేతనం ఎగురవేసి స్వర్ణ పతకాన్ని తీసుకువచ్చారు. అదేవిధంగా డబుల్స్ 45 ప్లస్ విభాగంలో డాక్టర్ పి.ప్రవీణ్, కమల్ అగర్వాల్‌లు, 50ప్లస్ విభాగంలో బి.కన్నా రెడ్డి, మురుగన్‌లు సెమీ ఫైనల్స్‌కు చేరుకుని స్వల్ప తేడాతో ఫైనల్స్‌లో వెను దిరిగారు. ఈ మేరకు క్రీడాకారులను వరంగల్ క్లబ్ సభ్యులు, వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండ్ర సత్యనారాయణరెడ్డిలు అభినందించారు.

టీబీఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి పరీక్షకు సమీరా



సమీరాకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఖిలావరంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం(వరంగల్) వారు ఇటీవల నిర్వహించిన జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష పోటీల్లో రాణించిన సమీరా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం శైలేంద్రకుమార్ తెలిపారు. గురువారం మధ్యకోటలోని ప్రభుత్వ ఆరెల్లి బుచ్చయ్య ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సమీరాను మెమెంటో, సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ విధానంలో జరుగు పోటీల్లో వరంగల్ జిల్లాకు గుర్తింపును తీసుకురావాలన్నారు. సమీరాను టీచర్లు శోభారాణి, భాస్కర్, కిరణ్, యాకూబ్ పాషా, వెంకటరెడ్డి, కుమారస్వామి, సత్తార్ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

వరంగల్ క్రైం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 16మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా, 14 మందికి న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి రూ.18,500 జరిమానా విధించగా, లేబర్‌కాలనీకి చెందిన పీ పవన్ కల్యాణ్, భూపాలపల్లి పలిమెలకు చెందిన కట్కం రాకేశ్‌కు రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని మరో ముగ్గురికి రూ.1500 జరిమానా విధించారన్నారు.

భగవద్గీతను పఠించాలి



భగవద్గీత పఠన పోటీలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

పోచమ్మమైదాన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకతీతంగా భగవద్గీతను పఠించడం వల్ల మానవాళికి మంచి జరుగుతుందని శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. పైడిపెల్లిలోని గురుధామ్‌లో (సప్తధామం) గురువారం కందుకూరి శివానందమూర్తి 96వ జయంతిని రెండోరోజు వైభవంగా జరిగాయి. శివానందగురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో భగవద్గీత పఠన పోటీలు నిర్వహించారు. వంద మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 5,116, రెండవది రూ. 3,116, మూడోవది 1,116 నగదు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారి సాయినారాయణ, గందె ఉమాశంకర్, ప్రణీత్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్ల పంపిణీ



విద్యార్థులకు ఆల్-ఇన్-వన్ గైడ్లను అందజేస్తున్న దృశ్యం

ఖిలా వరంగల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ విద్యార్థులకు నిన్నినాటి మిత్రులు ఆల్‌ఇన్ వన్ గైడ్లను అందజేశారు. గురువారం శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థులకు హెచ్‌ఎం పూస నరేంద్రస్వామి ఆధ్వర్యంలో గైడ్లను అందజేశారు. నిన్నినాటి మిత్ర బృందం సభ్యుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు డి. తిరుపతి, ఎస్ లక్ష్మీనారాయణ, ఎన్. శ్రీనివాస్, పి. రంగాచారి, ఎస్. కవిత, జే. అంజయ్య, కే సుజాత, ధనలక్ష్మి, సుహాసిని పాల్గొన్నారు.



మొక్కజొన్నల సాగుకే రైతుల మొగ్గు

• మంచి ధర ఉండడంతో అన్నదాతల ఆసక్తి

వర్ధన్నపేట, డిసెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత యాసంగిలో చాలా మంది రైతులు మొక్కజొన్న సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు. తక్కువ సమయంలో పంటచేతికి రావడం, మంచి ధర ఉండడంతో రైతులు వీటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారస్తులు కూడా మద్దతు ధరకంటే ఎక్కువ చెల్లిస్తుంటారు. అందువల్ల ఇప్పటికే వందల ఎకరాల్లో మొక్కజొన్న విత్తుకున్నారు.



మొక్కజొన్న పంట

ముందే చేతికి వస్తూ..

మొక్కజొన్న పంట ఫిబ్రవరిలోనే చేతికి వస్తుంది. దీనికి తోడు అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంట దెబ్బతింటుంది. అదే మొక్కజొన్నసాగుకు ఎలాంటి సమస్య ఉండదు. అందువల్ల ఈసారి చాలా మంది రైతులు ఈ పాటికే మొక్కజొన్న పంటను విత్తుకున్నారు. మక్కలు ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.95వేల వరకువస్తాయి. పెట్టుబడి రూ.23 వేలు పోను మిగతాది లాభం ఉంటుంది. గత ఏడాది నుంచి తిరిగి మొక్కజొన్నసాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఈసారి గతంలోకంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేయనున్నారు. ఆరుతడి పంటకావడంతో పాటు ధర ఎక్కువగా వస్తుండడంతో ఈసారి రికార్డు స్థాయిలో మొక్కజొన్న సాగయ్యే అవకాశాలు ఉన్నాయి.

కోళ్లఫారాలకు అవసరం

మొక్కజొన్నలను ఎక్కువగా ఫౌల్ట్రీలకు ఉపయోగిస్తున్నారు. వర్షాకాలంలో మొక్కజొన్న సాగు నామమాత్రంగా ఉంది. చాలా మంది రైతులు వరిసాగు చేశారు. గతంలో వానాకాలంలో చాలా మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తుండేవారు. కానీ, ప్రస్తుతం నీటి వనరులు ఎక్కువగా ఉండడంతో వరిసాగువైపే మొగ్గుచూపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫౌల్ట్రీలకు మక్కలు ఎక్కువగా అవసరమవుతాయి. కానీ, సాగులేకపోవడంతో మక్కల కొరత ఏర్పడి ధర పెరుగుతూ వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని యాసంగిలో మొక్కజొన్న సాగువైపు మొగ్గుచూపుతున్నారు. గత యాసంగిలో ఎందుకు సాగు చేయలేకపోయామని చాలా మంది రైతులు బాధపడ్డారు.

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నర్సంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవహేళనగా మాట్లాడి బహుజన సమాజాన్ని అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ డిమాండ్‌చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్ పట్ల అనుచిత వాఖ్యలు చేసిన అమిత్‌షా వైఖరిని ఖండిస్తూ ఎంసీపీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాగసుధ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో ఏక వచనంతో సంబోధిస్తూ అవహేళనగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మాట్లాడడం రాజ్యాంగంపై ఆయనకున్న గౌరవం ఏపాటిదో అర్థమవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అంబేద్కర్‌పై ఏమాత్రం గౌరవం ఉన్నా తక్షణమే హోం మంత్రిగా అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.యాకయ్య, బెజ్జంకి రాజేశ్, పుట్టపాక సునీత, గడ్డం శ్రీను, సతీష్, గడ్డం నిర్మల. బంగారి సందీప్, ఖాజా, ప్రమీల, లావణ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నర్సంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా బహుజన సమాజ్ పార్టీ నర్సంపేట మండల పార్టీ అధ్యక్షుడు కొర్ర గవర్‌సింగ్ ఆధ్వర్యంలో గురువారం నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోం మంత్రి హోదాలో ఉన్న అమిత్‌షా అహంకారపూరితంగా మాట్లాడడం తగదన్నారు. అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



నర్సంపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

క్షమాపణలు చెప్పాలి

రాయపర్తి (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ పట్ల మాట్లాడిన విధానానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు చిలుముల్ల కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొండూరు గ్రామంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుజ్జ సుధాకర్, తాళ్లపెల్లి ప్రశాంత్, సతీష్, కుమార్, మద్దెల రాజు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

గీసుగొండ (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో మాట్లాడారంటూ ఆయన దిష్టిబొమ్మను ఎంసీపీఐ నాయకులు గురువారం మచ్చాపూర్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి మాట్లాడుతూ రాజ్యాంగ సృష్టికర్తపై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకం సంధ్య, గూడ సురేష్, సోమిడి రవి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

అగ్రవర్ణాల ఆధిపత్య పోరులో రాజ్యాంగాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని తోటి తెగ సేవా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుగ్రం రఘు ఆరోపించారు. జాన్ పాకలో ఆయన గురువారం మాట్లాడారు. రాజ్యాంగకర్తనే అవమానపరిచిన అతడిపై అట్రాసిటి చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు.

ఎస్‌బీఐ సేవలను వినియోగించుకోవాలి

చెన్నారావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని నర్సంపేట ఎస్‌బీఐ ఏసీబీ బ్రాంచ్ మేనేజర్ కోరే రమేష్ అన్నారు. గురువారం లింగాపురంలో జరిగిన అన్నదాత మహోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐ క్రాప్‌లోన్స్, మార్టిగేజ్‌లోన్స్, కిసాన్ రిన్ సమృద్ధి, అగ్రి ఎంటర్ప్రైజ్ లోన్స్ లాంటివి అనేక రకాలుగా రైతులకు అంజేస్తామన్నారు. రైతు వ్యవసాయ ఉత్పత్తి సంఘాలను రైతులు ఏర్పాటుచేసుకొని ప్రభుత్వాలు అందించే సబ్సిడీలను పొందాలని అవగాహన కల్పించారు. అనంతరం పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో తప్పేట రమేష్, రాజేందర్, సంతోష్, కరుణాకర్, దూడయ్య, అశోక్, శంకర్, కుమారస్వామి, కొమురయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష



నెక్కొండలో అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన భక్తులు

నర్సంపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరోజినిదేవి రోడ్‌లోని గుడికందుల సదానందం గృహంలో గురువారం అయ్యప్పస్వామికి అభిషేక దివ్యపడి పూజ కార్యక్రమాన్ని గురుస్వామి అనిల్ మహేంద్ర ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు చేసిన అయ్యప్ప శరణు ఘోష మార్మోగింది. అయ్యప్ప విగ్రహం వద్ద 18 మెట్లు ఏర్పాటుచేసి, వివిధ రకాల అభిషేకం, పుష్పాలతో దివ్య పడిపూజ చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన నంగునూరి రాజ్‌కుమార్ అనే భక్తుడు తాను కోరుకున్న కోర్కె నెరవేరినందుకు కానుకగా అయ్యప్పస్వామి విగ్రహాన్ని గురుస్వామికి అందజేశారు. కార్యక్రమంలో మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి): స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ అయ్యప్పస్వాములు బుధవారం రాత్రి నెక్కొండలోని గ్రామీణ వైద్యులు కొంకాల సాంబయ్య ఇంటి అవరణలో నిర్వహించిన పడిపూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనగా అయ్యప్పల శరణ ఘోషతో వీధులన్నీ మార్మోగాయి. రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఈ పడిపూజ వేడుకలు ఆరు గంటల పాటు నిర్వహించారు, గురుస్వామి రాంబాబు పూజా కార్యక్రమాలను జరిపించగా, గురు స్వాములు శ్రీరంగం సంపత్, దాసరి శ్రీనివాస్, అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొనగా, సాధారణ భక్తులు కూడా పడిపూజ కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట పట్టణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది. గురువారం పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంఆవరణలో గడ్డం సంతోష్ కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నదానం చేయగా, సాయిబాబా మందిర నిర్వాహకులు పూజ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోమాండ్ల వెంకట్‌రెడ్డి గురుస్వామి, రాజు గురుస్వామి, కీర్తి సారంగ పాణి గురుస్వాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరెడ్డితోనే నర్సంపేట పట్టణాభివృద్ధి

నర్సంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితోనే పట్టణాభివృద్ధి సాధ్యమని 19వ వార్డు కౌన్సిలర్ పెండెం లక్ష్మి, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో ఎమ్మెల్యే సహకారంతో టఫెడ్‌కో నిధులు రూ.కోటి 60లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. వార్డు అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బత్తిని రాజేందర్, కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, ములుకల వినోద సాంబయ్య, ఓర్సు అంజలి, అశోక్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, చింతల కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, బిట్ల మనోహర్ పాల్గొన్నారు.



19వ వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ లక్ష్మి

ఆలయ అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం



విరాళాన్ని అందిస్తున్న గోపాల్‌రెడ్డి దంపతులు

గీసుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి హనుమకొండ జిల్లా చింతగట్టుకు చెందిన బిల్ల హేమలత, గోపాల్ రెడ్డి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ సాంబరెడ్డికి గురువారం అందజేశారు. గుట్టపై పలు నిర్మాణాల కోసం ఈ విరాళాలను ఖర్చు చేయనున్నట్లు సాంబరెడ్డి చెప్పారు. ఆలయానికి శాతావాహన కాలం నాటి చరిత్ర ఉన్నట్లు ఆధారాలు లభించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మంజుల, కర్ణకంటి రామ్మూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

ఖానాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ బాలికలలో క్రమశిక్షణ, దేహదారుఢ్య, ఆత్మస్థైర్యం నెలకొల్పుటకు శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్ నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నల్లబెల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను దివ్యాంగులకు ఇవ్వాలని మండల వికలాంగుల సంఘం అధ్యక్షుడు పులి రమేష్ అన్నారు. గురువారం మండల ఎంపీడీవో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ శైలజకు దివ్యాంగుల వినతి ప్రతాన్ని అందజేశారు. రమేష్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా మండలంలోని దివ్యాంగులను ప్రభుత్వం గుర్తించి అర్హులైన వారికి తప్పకుండా ఇండ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు గుండాల రమేష్, జాటోతు రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ అందజేత

నర్సంపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఐ. రామకృష్ణకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వారు గురువారం వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటిని అందించేందుకు వాటర్ డిస్పెన్సర్‌ను అందజేసినట్లు బ్యాంక్ ప్రతినిధులు రాజ్‌కుమార్, భగత్‌లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శంకరయ్య, సురేందర్, కల్పన, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖానాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఉస్మాన్ పాషా అన్నారు. గురువారం పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల పరిషత్ కార్యాలయంలో సూపరిండెంట్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ ఉస్మాన్ పాషా మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే సమ్మెలో జీపీ కార్మికులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బోడ వీరన్న, గుగులోతు బిక్షానాయక్, కోడూరి వెంకటమ్మ, యాకుబ్, సోమక్క, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నల్లబెల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిండ్ల వీరయ్యపల్లిలో గురువారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. మామిండ వీరయ్యపల్లిలో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో ప్రజా రవాణాకు ఇబ్బంది ఉందని స్థానిక ఎమ్మెల్యే మాధవరెడ్డి దృష్టికి సమస్య తీసుకెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నానని, సీసీ రోడ్ల పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో గురువారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో నాయకులు వైనాల అశోక్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నారావుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జల్లి గ్రామంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ధరణిని తీసివేసి దాని స్థానంలో (భూ భారతి పోర్టల్) భూమిపై హక్కుల రికార్డు చట్టం 2024ను ప్రవేశపెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాదావత్ బాలు, ఎమ్డీ.రఫీ, బిట్ల శ్రీనివాస్, పింగిలి రజకరెడ్డి, చిలుపూరి వీరస్వామి, గంధం బాలారాజు, రాధారపు యకాంబ్రం, అంబాల శ్రీనివాస్, జరుపుల ప్రవీణ్, జరుపుల శ్రీను, నరేష్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కొండూరులో బీజేపీ సభ్యత్వ నమోదు

రాయపర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండూరులో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాయపర్తి మండల అధ్యక్షుడు నూనె అనిల్ ఆధ్వర్యంలో బూతులలో తిరుగుతూ సభ్యత్వాల నమోదు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ రాబోయే రోజులు బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంత రం 161 బూత్ అధ్యక్షుడిగా ముత్యాల అనిల్, 162 అధ్యక్షుడిగా జక్కుల సందీప్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి వడ్లకొండ రవి, ఎనగందుల శ్రావణ్, మంచాల సుమన్, భాస్కర్, అజయ్, రాజు, దేవరాజ్, రాకేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మంద సంజీవ మరణం పార్టీకి తీరని లోటు

నల్లబెల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మంద సంజీవ మృతి చెందడం ఎంసీపీఐ(యూ) పార్టీకి తీరని లోటని నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజా సాహెబ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మృతుడి భౌతికకాయానికి ఎంసీపీఐ(యూ) నాయకులు నివాళులర్పించారు. రాజాసాహెబ్ మాట్లాడుతూ.. అమరుడు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్‌తో కలిసి ఉద్యమాలు చేశాడన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పోరాట స్ఫూర్తితోనే నిలబడ్డారని సంజీవ సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వంగల రాగసుధ, నాగెల్లి కొమురయ్య, దామ సాంబయ్య, మార్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో అభ్యసన సామర్థ్యం పెరగాలి

రాయపర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరగాలని రాయపర్తి ప్రభుత్వం పాఠశాల హెచ్‌ఎం గారె కృష్ణమూర్తి సూచించారు. గురువారం మండల కేంద్రంలో డీఈవో ఆదేశాల మేరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో రెండు రోజుల పాటు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభతరంగా విద్యార్థులకు లోకాస్ట్, నో కాస్ట్ అనే ఉపకరణాలను తయారు చేసి మెరుగైన పద్ధతిలో బోధించాలన్నారు. విద్యార్థులకు రాత పరీక్షల్లో నైపుణ్యం పెంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అజ్మీరా ఉమాదేవి, ఆర్పీలు వెంకటేశ్వర్లు, రజినీకాంత్, వెంకటరమణ, మహేశ్వర్,సునీత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

దుగ్గొండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మధ్యాహ్న భోజనం వంటకాలను గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి సందర్శించి పరిశీలన చేశారు. లక్ష్మీపురంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మైసంపల్లి, తొగర్రాయి, దుగ్గొండి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర విద్యాలయంలో మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలన చేసి పిల్లలతో కలసి భోజనం చేశారు. ఆమె వెంట తాహసీల్దార్ రవిచంద్రా రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్‌లు ఉన్నారు.

'పంబాల'ను ఎస్సీ వర్గీకరణ ఏ గ్రూపులో చేర్చాలి

దుగ్గొండి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో పంబాల కులస్థులను ఏ గ్రూపులో నమోదు చేయాలని పంబాల కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రౌతు హరికృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ జ్యూ డిషియల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు ఆయన వెల్లడించారు. పంబాల కులస్థులు ఆర్థికంగా వెనుకబడిఉన్నారని, వర్గీకరణలో ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని వినతి పత్రంలో తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుద్దాల కుమారస్వామి, గడ్డం రాజయ్య లింగమూర్తి, భాస్కర్, రఘుపతి,గోవర్ధన్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రిటైర్డ్ జస్టిస్ షమీం అక్తర్‌ను గురువారం తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీపీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసేలా నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేష్, రవీందర్, భాస్కర్, కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడిగా బషీర్



బషీర్

నెక్కొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ బ్యాండు వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడిగా ఎమ్డీ.బషీర్, ఉపాధ్యక్షుడు ఎమ్డీ.రాజ్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి జంపాల కుమార్, సహాయ కార్యదర్శి మంకాల సాంబయ్య, గౌరవ అధ్యక్షుడిగా ఎమ్డీ. మౌలానాను ఏకగ్రావంగా ఎన్నుకున్నట్లు వరంగల్ జిల్లా బ్యాండు వాయిద్య కళాకారుల అడ్‌హక్ కమిటీ కన్వీనర్ మద్దికుంట్ల యాదగిరి తెలిపారు.

క్రైం కార్నర్

చోరీ నిందితుడి అరెస్ట్

గీసుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 16వ డివిజన్ కట్టమల్లన్న సమీపంలోని రేణుకా ఎల్లమ్మ గుడిలో వెండి, బంగారు అభరణాలను దొంగిలించిన నిందితుడిని గీసుగొండ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్ది రోజుల క్రితం రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగి అమ్మవారి బంగారు ముక్కుపుల్ల, ముక్కుపోగు, వెండి ముక్కుపుడక, చంద్రవంకబొట్టు, వెండి చేతికడాను ఎత్తుకెళ్లారు. గురువారం ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. హనుమకొండ జిల్లా కమలాపురం మండలం వంగపల్లి గ్రామానికి చెందిన కొలిపాక రాజు కొన్ని సంవత్సరాలుగా ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంతో పాటు, ములకనూరు మండలంలోని ఆలయాల్లో హుండీలను పగులకొట్టి నగదు, దేవుడి ఆభరణాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సంగెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపల్లికి చెందిన వృద్ధుడు వేల్పుల రాజాలు(80) పురుగుల మందుతాగి, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాలు వయోభారంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. భార్య లక్ష్మమ్మతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 17న రాత్రి రాజాలు పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

సంగెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంలో ఇంటర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎస్ఐ నరేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అందిస్తున్న దాతలను అభినందించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, దాతలు శ్యామల శిల్ప, వల్లాల శైలజ, జానకి, నరసన్, ఆర్ వెంకటేశ్వర్‌రావు, పులి రాజశేఖర్, వల్లాల సంపత్, నవీన్, అధ్యాపకులు విజయనిర్మల, నాగరాజు, అనిల్‌కుమార్, కుమారస్వామి, యాకసాయిలు, రాజీ, చిరంజీవి, మాధవి, సుధీర్‌కుమార్, పద్మ, రమాదేవి, సదయ్య, శివ, లక్ష్మి, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాలమహానాడు నాయకులు

గీసుగొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాదిగల వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్లటానికి బయలుదేరిన మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి తుప్పరి నరసింహస్వామి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాంపెల్లి శ్రీనివాస్, పసుల భిక్షపతి, బాలరాజు, సతీష్, సంపత్, భరత్, కుమార్, శ్యామ్, నాంపెల్లి సారంగం, దేవేందర్, లక్షణ్ తదితరులు ఉన్నారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న మహిళలకు, పిల్లలకు సఖి అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో గురువారం మహిళా సంఘాల సభ్యులతో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో సఖి సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం సఖి సెంటర్లను నిర్వహిస్తున్నాయని అన్నారు. బాధిత మహిళలకు పోలీస్ సహాయం, న్యాయ సహాయం, వైద్య సహాయము, తాత్కాలిక వసతి వంటి సేవలు ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు హెల్ప్ లైన్ నెంబర్ 181కు ఫోన్ చేసినట్లయితే రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తిరుమల, వీఏఏ మంజుల తదితరులు పాల్గొన్నారు.




సఖి సేవలపై అవగాహన కల్పిస్తున్న శోభారాణి

బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్ అందజేత

• డ్రైవర్‌ను అభినందించిన డీఎం

నర్సంపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి ప్రయాణికుడికి అందజేసి ఆర్టీసీ డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలిలా వున్నాయి. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్ 03జడ్0454 నెంబర్ గల సూపర్ లగ్జరీ బస్సు బుధవారం రాత్రి ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి ప్రయాణికులతో నర్సంపేటకు బయలుదేరగా అందులో హనుమకొండలోని గోపాల్‌పూర్‌కు చెందిన సయ్యద్ వజాయుద్దీన్ అనే ప్రయాణికుడు ఉన్నాడు. హన్మకొండకు చేరుకోగానే పరజయుద్దీన్ తన రూ.90వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను బస్సులో మరిచిపోయాడు. సదరు ప్రయాణికుడు తన ల్యాప్‌టాప్ గుర్తుకొచ్చి డ్రైవర్ మహేందర్‌రెడ్డి ఫోన్ నెంబర్ తెలుసుకొని సమాచారం అందించాడు. వెంటనే డ్రైవర్ ల్యాప్‌టాప్ భద్రపరిచి ఇదే రోజు రాత్రి నర్సంపేట డిపోలో అధికారుల సమక్షంలో ల్యాప్‌టాప్‌ను ప్రయాణికుడికి అందజేశాడు. దీంతో డ్రైవర్‌ను నర్సంపేట డీఎం ప్రసూనలక్ష్మీతో పాటు ఉద్యోగులు, ప్రయాణికులు అభినందించారు.



ప్రయాణికుడికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ మహేందర్‌రెడ్డి